ఈశ్వరయ్యతో నా పరిచయం చాలా చిత్రంగా జరిగింది. ఆ పరిచయం జరిగినప్పుడు ఈ ఆరడుగుల ఎత్తు ఆకారం విల్లులా వంగ లేదు. కండ్లు ఆనందనిలయాలు కాలేదు. ఆత్మీయత అర చేతిలోకి జారి అతడి అరచేతిని ఒడిసి పట్టుకొని కరచాలనమై మిడిసిపడ లేదు. పెదాల మీద చిరు నవ్వుల పూలు పూయ లేదు.

అయితే ఇద్దరి చూపులు మాత్రం ఒక్క క్షణం తీక్షణంగా పలకరించుకొన్నాయి- మౌన భాషతో.

"ఒరే! ఇల్లు, ఇల్లాలు అనువుగా కుదరడం మనిషి జీవితంలో ఒక గొప్ప వరం. ఇల్లాలా? అనువైనదే దొరికింది. ఇల్లొకటి కట్టించుకుంటున్నాను గదా? ఒక్క సారట్లా వచ్చి చూస్తే నీ యిల్లు బంగారంగాను, నా యిల్లు బంగారమై పోదు లేరా!" అని ఒక మిత్రుడు నిష్ఠురాన్ని నిప్పులుగా మీద చల్లితే తట్టుకోలేకుండా చూడడానికి వెళ్లాను.

ఈశ్వరయ్య తాపీ పని మేస్త్రీ హోదాలో ఇల్లు కట్టిస్తున్నాడు. కూలీలు ఇంటి ముందు తట్టు తూర్పు పడమరగా ప్రహారీ గోడ కట్టుతున్నారు. తెల్లని మల్లు పంచె అడ్డ కట్టు కట్టి దాంతో పోటీ పడే తెల్ల చొక్కా తొడుక్కొని ఆ గోడ ముందు నిలబడి చూపులను కూలీల చేతులకు తగిలించాడు. నేనూ అతనికి దగ్గర్లోనే నిలబడి ఆ గోడ మీద చూపు నిలిపాను. పడమటి తట్టు ఒక్క నూలు ముందుకు వచ్చినట్లుగా కనపడింది. ఆ మాటే అతనితో అన్నాను.

"వీల్లేదు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"దేనికన్నా మంచిది. చూడండి" అన్నాను.

కూలీలను పని నిలపమన్నాడు. దారం పట్ట మన్నాడు. ఒకే ఒక్కనూలు వ్యత్యాసం ఉంది. అదో! అప్పుడే మా గెలుపు ఓటముల చూపులు ఒక్క క్షణం కలపలుక్కొన్నాయి.

ఇది జరిగి పది సంవత్సరాలకు పైబడింది. ఈ పది సంవత్సరాల్లో సిమెంటుతో కట్టిన కట్టడం నీళ్లు పోసే కొలది బలపడినట్లు మా పరిచయం బలపడుతూ ఇప్పటికి అది ఒక విడదీయ లేని ఆత్మీయతగా స్థిర పడింది.

అలా పరిచయమైన తర్వాత నేను తెలుసుకొనింది ఏమంటే?-

తెలివి ఒకడబ్బ సొత్తు కాదు అనడానికి చక్కని నిదర్శనం ఈశ్వరయ్య. ఆరడుగుల ఎత్తు. ఎత్తుకు తగిన అందం. అందానికి వన్నె తెచ్చే వినయం- ఈశ్వరయ్య అడగకనే అందిన వరాలు!

పుట్టింది దాదాపు నలభైఏండ్లకు ముందు తమిళ నాడు రాష్ట్రానికి చెందిన తిరుపూర్‌లో. కురుకురుమీసం వచ్చే వరకు పెరిగిందీ అక్కడే. కొడుకును బాగా చదివించి పెద్ద ఉద్యోగస్థుడిని చేయాలన్న తల్లిదండ్రుల ఆశలకు పేదరికం తెర దించింది. దాన్ని తొలగించే శక్తి అప్పట్లో వాళ్లకు లేదు. పొట్ట ఒక టుంది. అది ఊరకే ఉండమన్నా ఉండదు. దాని కోసరం ఏదో ఒక పని చేయాలి. కుల వృత్తిగా అయ్యకు, అన్నకు సంక్రమించింది తాపీ పని. ఆ పనే తానూ నేర్చుకొన్నాడు. పని తాపీగా చేతిలో ఉన్న వాడికి తిరుపూర్ అయినా ఒక్కటే, తిరుపతి అయినా ఒక్కటే అనుకొన్నాడు. తిరుపతి చేరుకొన్నాడు. ఈశ్వరన్ ఈశ్వరయ్యగా మారాడు. నెలలు తిరగక ముందే మంచి పేరు సంపాదించుకొన్నాడు.

# చలువరాతి సమాధి

## పులికంటి కృష్ణారెడ్డి

తన వృత్తిలో తనను మించిన వాడు లేడనిపించుకోవడమే ఆతని ప్రత్యేకత.

తిరుపతిలో మట్టి పలక కరిణె చేత పట్టి తాపీ పని కూలీగా బ్రతుకు తెరువుకు తెర తీసిన ఈశ్వరయ్య ఏండ్లు పూండ్లు గడవక ముందే మట్టి చేతికి తగలకుండా పెద్ద పెద్ద కట్టడాలు కట్టించే మేస్త్రీ స్థాయికి ఎదిగా డంటే అది ఆతని పనితనానికి నిదర్శనం.


"ఒక మంచి ఇల్లు కట్టించు కోవాలంటే అది ఈశ్వరయ్య చేతుల మీద జరగాల్సిందే!" అని అనిపించుకోవడ మంటే ఏ వృత్తికారుడికైనా కిరీటం పెట్టినట్లే కదా?

మట్టి, యినుము, యిసుక జడ పదార్థాలు. ప్రాణం లేని వస్తువులకే ప్రాణ ప్రతిష్ఠ చేయగల నేర్పరి ఈశ్వరయ్య. ఆ పనిలో అచ్చు తప్పులు వెతికే కన్ను నాది. అందు వల్ల ఈశ్వరయ్య కట్టిస్తున్న ఏ కట్టడం పనైనా జరుగుతున్నప్పుడు ఆ కట్టడాన్ని నాకు చూపించడం - మంచీ చెడ్డలు చర్చించుకోవడం ఒక అలవాటుగా మారింది- అభిరుచులు అతికిన కారణంగా.

ఆ రోజు నేను ఆ ఆరంతస్తుల మేడ ముందు ఈశ్వరయ్యతో కలిసి నిలబడుకొన్న కారణం అదే!

అది కలిగిన వాడు కట్టించుకొంటున్న అపార్ట్‌మెంట్. ఏడాదికి పైగా పని జరుగుతూ ఉంది. ఒక్క కోటి రూపాయలకు పైగా ఖర్చవుతుందని అంచనా. ఈ ఏడాదిగా అప్పుడప్పుడు నేను ఈశ్వరయ్యను కలుసుకొంటూనే ఉన్నాను.


ఆ రోజు పై అంతస్థులో యిటుక కట్టడం జరుగుతూ ఉంది. దానికి దిగువ అంతస్థులో పూత పని.. దానికి దిగువ అంతస్థులో వడ్రంగి పని... దానికి దిగువ అంతస్థులో విద్యుత్ పరికరాలు



అమర్చడం జరుగుతూ ఉంది. ఎవరి పని వాళ్ల చకచకా చేసుకొని పోతుంటే అక్క డొక సంత జరిగిన సందడి. అయితే ఎంత మంది ఏయే పని చేస్తున్నా ఒక్క వ్యక్తి మాత్రం తప్పని సరిగా నా చూపుల్లో పడే వాడు.

మనిషి అంత పొడుగూ కాడు, మరీ అంత పొట్టీ కాదు. దాదాపు డెబ్బై యేండ్లకు అటో యిటో కారణంగా తెల్లబడిన జుట్టు... నాలుగు మూరల తుండు గుడ్డ మొల కట్టు... అక్క డక్కడ చిరుగులు పడి మాసిన చొక్కా.... వంగీ వంగనట్లున్న ఆకారం... ఆ ఆకార మంతా ముడతలు -ఏ ముడతను తడిమినా కండ్లు చెమర్చే అనుభవాన్ని వెలగక్కుతుందేమో అన్న సందేహం!

ఆ మనిషి ఎవరి వైపు చూడడు. ఎవరినీ పలకరించడు. అయితే నిలిచిన చోట కాలు నిలవదు. అక్కడ జరుగుతున్న పనిని డేగ చూపులతో గమనిస్తూ తిరుగుతుంటాడు. ఎక్కడ ఎవరు ఏ చిన్న పొరపాటు చేసినా తనకు తానుగా సరి చేస్తాడే తప్ప ఎవరి మీద విరుచుక పడడు. కొత్త యిల్లు కట్టుకొంటున్నప్పుడు కొన్ని చిన్న చిన్న పొరపాట్లు చాలా సహజంగా జరుగుతుంటాయి. వాటిని పెద్దగా పట్టించు కోరు. కానీ ఆ పెద్దాయన అలా కారు. సిమెంటు మూటలు ఖాళీ అవుతుంటాయి. ఖాళీ అయిన



గోతాలను కూలీలు విసిరిసిరి పారేస్తుంటారు. అవి అడ్డదిడ్డంగా పడుతుంటాయి. వాటిని కొందరు తొక్కుతుంటారు. ఆ పెద్దాయన ఆ గోతాలను ఒక చోటికి చేర వేస్తాడు. బాగా విదిలిస్తాడు. మట్టసంగా మడిచి భద్ర పరుస్తాడు.

అది ఖాళీ గోతం అయినా దాని విలువ రెండు రూపాయ లని అతనికి తెలుసు.

ట్రాక్టర్లో యిటుకలు వస్తుంటాయి. వాటిని దింపేటప్పుడు కొన్ని విరిగి పోతుంటాయి. కూలీలు వాటిని నిర్లక్ష్యంగా ఎత్తి పారేస్తుంటారు. కాని ఆ పెద్దాయన వాటన్నిటిని ఎత్తి ఒక చోట కుప్ప పోస్తాడు.

ఇవేమీ లేనప్పుడు కట్టిన కట్టడానికి నీళ్లు పట్టడమో, చిందరవందరగా పడి ఉన్న సామానులను అనువైన చోటికి చేర్చి సర్ది పెట్టడమో చేస్తుంటాడు.

ఆ వయస్సులో కూడా ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకొంటున్న ఆ మనిషిని చూస్తే నాకు ఒక రకమైన జాలి. ఆ వయస్సుకు ఆ మాత్రం లేచి తిరగ్గలమా? అన్న సందేహం. అయితే నే నెప్పుడూ అతనిని పలకరించిన పాపాన పోలేదు. బహుశా ఆ యింటి యజమాని అతని వయస్సుకు తగిన గౌరవం యిచ్చి ఉంటాడు. ఒక తరానికి నమ్మకానికి ముడి పెట్టి ఆ నమ్మకాన్ని జాగ్రత్తగా సొమ్ము చేసుకొంటున్నాడు. అందుకేనేమో వాచ్‌మెన్ ఉద్యోగం యిచ్చి ఉంటాడు అని నాలో కలిగిన అభిప్రాయమేనేమో, మా మధ్య దూరానికి కారణమై ఉంటుంది.

ఆ రోజు నేను సుమారు పది గంటలప్పుడు ఈశ్వరయ్య వద్దకు వెళ్లాను. మధ్యాహ్నం వరకు అక్కడే ఉన్నాను. తొందర్లోనే కట్టడం పని పూర్తి అవుతుంది. అయితే ముందు భాగాన్ని ఎలా తీర్చి దిద్దితే అందంగా ఉంటుందో యింజనీర్ ప్లాన్ సహాయంతో తర్జనభర్జనలు పడుతున్నాము. ఒంటి గంట అయింది. కూలీలు పని నిలిపారు. భోంచేయడానికి కాళ్లూ, చేతులూ కడుక్కొంటున్నారు.

"ఈ పూటకు మనం కూడా ఏదైనా ఒక మంచి హోటల్లో కలిసి భోంచేద్దాం మామా!" అన్నాడు ఈశ్వరయ్య.

ఎప్పుడు ఈశ్వరయ్య 'మామా!' అని పిలిస్తే 'ఏంవిరా అల్లుడా?' అని అన్నానో గుర్తు లేదు కానీ - మామా అల్లుళ్ల సంబంధం మాత్రం ఎన్ని అసూయలకు గురవుతున్నా మొగ్గ తొడిగి పుష్పించి సువాసనలు వెదజల్లుతూనే ఉంది.

ఈశ్వరయ్య మాటను కాదన లేని బలహీనత నాది. అందుకే - "సరే! పదరా" అన్నాను.

బయలుదేరేది యిద్దరే కదా అనుకొని నే నాతని స్కూటర్ ప్రక్కన నిలబడ్డాను. అయితే ఈశ్వరయ్య ఆ పెద్దాయన్ను పిలిచాడు. తన స్కూటర్ ఎక్క మన్నాడు. నా అభిప్రాయం తారుమా రవడంతో ఆలోచన, ఆ ఆలోచన మేస్త్రీలు వాచ్‌మేన్‌ను యిలా మచ్చిక చేసుకోవడం తప్పదేమో? అన్న సందేహంగా మారి నా కన్నుల్లోకి ప్రాకి చూపై సూటిగా ఈశ్వరయ్య ముఖాన్ని తాకింది.

అతడి పెదాల మీద ఒక చిరునవ్వు రేఖామాత్రంగా విరిసి మాయ మయింది.

నేను మారు మాట్లాడకుండా నా స్కూటర్ మీద బయలుదేరాను. రెండు స్కూటర్ల మీద ముగ్గురు. ముగ్గురు మూడు రకాలైన ఆలోచనల మధ్య పడి నలుగుతూ ఉంటే భౌతికపరమైన శక్తి స్కూటర్ల మీద జాగ్రత్తగా పని చేసింది. ఒక హోటల్లో కూర్చున్నాము. సర్వర్లు ఈశ్వరయ్య కనుసన్నల్లో మెలుగుతూంటే భోంచేస్తున్నాము. పెద్దాయన్ను ఆప్యాయంగా అడిగి అడిగి ఆయన కోరింది తెప్పిస్తున్నాడు ఈశ్వరయ్య. 'వీడు తెలివైన వాడే కాదు, మంచి లౌకికుడు కూడా!' అన్న అభిప్రాయాన్ని నేను అన్నంతో కలిపి నంజుకొంటున్నాను. తృప్తిగా తిన్నాము. ఈశ్వరయ్య బిల్లు చెల్లించాడు. ఆ తర్వాత హోటల్ ముందు స్కూటర్ల ప్రక్కన నిలబడు కొన్నాము.

ఆ పెద్దాయన మాత్రం మాకు కొంత దూరంలో నిలబడి బీడీ ముట్టించుకొన్నాడు. పసి పాప పాల పీకను లాగినట్లు బోసి పెదవులతో బీడీ లాగుతున్నాడు. ఎటో నిలిచిన ఆతని చూపులను పరామర్శిస్తూ పొగ పైకి లేస్తూ ఉంది.

"ఆ పెద్దాయన ఎవ రనుకున్నావ్ మామా?"

పెద్దాయన మీది చూపు ఈశ్వరయ్య వైపు తిరిగింది.

"వాచ్‌మేన్ అనుకుంటా ఉండావ్ గదా?"

అడగడంలో నా అభిప్రాయాన్ని సవాలు చేస్తున్న ధ్వని. నా ముఖం ప్రశ్నార్థకానికి ప్రతిబింబమయింది. కను రెప్పల మధ్య దూరం తగ్గి చూపు పదు నెక్కింది. ఈశ్వరయ్య పకపక నవ్వుతున్నాడు.

"ఎందు కలా నవ్వుతున్నావ్?"

"నేను వాచ్ మేన్‌కు యీ మాదిరి భోజనాలు పెట్టి కాపీ లిచ్చి మంచి చేసుకుంటా ఉండాను గదా?"

చదువు లేని ఈ మనిషి నా అభిప్రాయాన్ని నా ప్రవర్తనలో పసి గట్టాడా? లేదు నా ముఖ కవళికల్లో చదివాడా? అని ఆలోచిస్తూ ఉంటే నా తల వాలి పోయింది.

'మామా! ఆయన ను వ్వనుకుంటున్నట్టు వాచ్ మేన్ కాదు. అయితే అదే పని చేస్తా ఆ యింటి ఓనర్‌కి అబ్బ!'

నా తల చివుక్కున పైకిలేచింది.

దగ్గరైన కను రెప్పలు యథాస్థితికి చేరుకొని కదిలీ మెదలకుండా నిలబడ్డాయి.

"ఆ తల మీద ఎంటికలు దుమ్ము కొట్టి తెల్లబడ లేదు. వెనక శానా పెద్దకతే ఉంది. చెప్తాలే పద" అన్నాడు.


ఆ పూటకు మేము ముగ్గురు విడిపోయాము.

అయితే ఆ పెద్దాయన మాత్రం నాతోనే ఉన్నాడు. నాలోనే ఉన్నాడు - మట్టిలో పురుగు కూరుక పోయినట్లుగా నా మెదడులో దూరి.

కొడుకు కోట్లకు పడగెత్తాడు. అతడు కట్టిస్తున్న చలువ రాతి మేడ వద్ద తండ్రి వాచ్ మేన్.

కొడుకు కార్లల్లో... ఏసీ గదుల్లో..

తండ్రి కొడుకు కట్టిస్తున్న కట్టడంలో తాను



ఒక భాగమై...

ఒక కుక్కి మంచానికి పరిమితమై -

కొడుకు యిస్త్రీ నలగని దుస్తుల్లో... తండ్రి మాసి చినిగిన గుడ్డల్తో.

ఈ కాలంలో యిది సహజమే అనుకుంటే సహజమే. కాదు విడ్డూరం అనుకుంటే విడ్డూరమే. అక్కడ నా ఆలోచన తెగుతుంది. ఆ పెద్దాయనతో ముడి పడుతుంది.

కోటీశ్వరుడైన కొడుకు యింకా కోట్లకు పడగెత్తాలని ఈ పెద్దాయన తాపత్రయ పడుతున్నాడా? లేదు - అడ్డాల నాడు బిడ్డలే కాని గడ్డా లొస్తే కాదనడానికి యితడు దృష్టాంతమా? ఒక దాని వెంట మరొకటిగా ఆలోచనలు లోతుగా మెదడులో వేళ్లూనుతూ. వెంట వెంటనే ఎండి నెర్రెలు చీలిన నేల మీద పడిన పై మబ్బు చినుకుల్లా ఆవిరై పోతూ!

రోజులు దొర్లి పోతున్నాయి.

నేను యథా ప్రకారం ఈశ్వరయ్యను కలుసుకొంటూనే ఉన్నాను. కలిసినపుడు తప్పనిసరిగా ఆ పెద్దాయన నా కంట పడతాడు. అయితే అతని మీద జాలి గాలికి కొట్టుకొని పోయింది. ఏదో అంటారే "పాచి పండ్లవాడు కూడ బెడితే బంగారు పండ్ల వాడు అనుభవించినట్లు" అని. ఇదీ అంతే అనుకొన్నాను. మనస్సు అలా సమాధాన పడినా ఆలోచించడం మానుకొన్నానా? లేదే. నా మట్టుకు నాకు ఆ స్థితి ఒక విచిత్ర వస్తువై కూర్చొనింది.

కోటీశ్వరుడైన కొడుకు పెద్ద అపార్ట్‌మెంట్ కట్టిస్తున్నాడు. తండ్రి అక్కడ వాచ్ మేన్ కన్నా హీనంగా పని చేస్తున్నాడు. ఈశ్వరయ్యే మేస్త్రీగా ఆ వాచ్ మేన్ బాగోగులు చాలా జాగ్రత్తగా గమనించుకొంటున్నాడు. అంటే - ఈ మానవ సంబంధాల్లో స్వార్థం పూసల్లో దారంలా దాగి ఉంది. ఈ స్వార్థమే మనుషుల్లో అనుబంధాలకు, ఆత్మీయతలకు కారణం. ఆ స్వార్థమే లేక పోతే జీవితమే అర్థరహితం. అది ఆ పెద్దాయన కావచ్చు. అతని కొడుకు కావచ్చు. ఈశ్వరయ్యే కావచ్చు. దీనికి భిన్నంగా మాత్రం నడుచుకో లేరు. అయితే ఆ స్వార్థానికి మనిషి బానిస అయినప్పుడే వచ్చిన చిక్కంతా. అప్పుడది దొంగతనాలకు, దోపిడీలకు, చివరికి హత్యలకు కూడా దారి తీస్తుంది.

ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఆ రాత్రి నిద్ర పట్టే సరికి చాలా ఆలస్య మయింది. ఎంత ఆలస్యంగా పడుకొన్నా వేకువ జామున్నే నిద్ర లేవడం అలవాటు. అలవాటు మేరకే మెలకువ వచ్చింది. అయితే పడక బద్దకం దుప్పటిని జాగ్రత్తగా కప్పి నాతో దోబూచు లాడుతూ ఉంది.

అంత వరకు నిశ్శబ్దాన్ని మోస్తూ నిద్ర పోయిన రోడ్లు ఉలిక్కి పడినట్టు మేలుకొన్నాయి. రకరకాల అరుపులు, ఆర్భాటాలతో జనానికి మేలుకొలుపులు పాడుతున్నాయి. వీటన్నిటినీ వెనక్కు నెట్టి మాయింటి కాలింగ్ బెల్ మోత!...

ఆ వేళప్పుడు కాలింగ్ బెల్ మోగడ మంటే తప్పని సరిగా అది పాల వాడి పనిగానే ఉంటుంది. 'ఆ పనితో నీకు సంబంధం లేదు. ఉన్నా పురుషాధిక్యం అడ్డుపడుతుంది. అడ్డవాకిలీ చేయడానికి యింట్లో ఆడ దొకటి ఉంది గదా!' అని పడక అంత వరకు అనుభవానికి తెచ్చుకొన్న మధుర స్మృతులను చెవిలో గుసగుస లాడుతూ ఉంది. దానికి తెర వేస్తున్నట్లుగా మా ఆవిడ "ఏఁవండీ!... ఏఁవండీ!" అని అరిచింది.

"చెప్పండీ!" అని పడక మీద నుండే దీర్ఘం తీశాను కూర గాయల మార్కెట్ లిస్ట్ చేతి కివ్వడానికేమో అనుకొని.

"ఈశ్వరయ్య...."

ఆమె నోట్లో మాట నోట్లో ఉండగానే ఎగిరి పడి పైకి లేచాను. ఈశ్వరయ్య సాధారణంగా రాడు. అందులో ఆ వేళప్పుడు రావడ మంటే?- అడ్డపంచ మొలకు చుట్టుకొంటూ ఒక్క అడుగులో యింటి వాకిట్లో పడ్డాను.

నన్ను చూస్తానే ఈశ్వరయ్య నన్ను కావిలించుకొని బోరుమన్నాడు.

సముద్రం మోకాటిలో తనుకునే ధైర్య శాలి ఈశ్వరయ్య.'


చేతిలో పని ఉంది. ఆ పనికి, డబ్బుకు సంబంధం ఉంది. జీవితం డబ్బుతో ముడి పడి ఉంది. అలాంటప్పుడు జీవితాన్ని అర చేతుల్లో పుష్పించుకో లేమా? - అన్న ధీమాతో బ్రతికే ఈశ్వరయ్య!!

అందంగా నవ్వుతూ మనిషిని అనాయాసంగా ఆకట్టుకొనే ఈశ్వరయ్య!

నన్ను కావలించుకొని పసి బిడ్డ కంటే అధ్వాన్నంగా ఏడుస్తున్నాడు. కారణం ఊహించ లేను. అడగ లేను. ఎలా సముదాయించాలి మరి?-

నా పరిస్థితి అర్థం చేసుకొన్నట్లుగా ఈశ్వరయ్య తల పైకెత్తాడు. ఎంత సేపటి నుండి ఏడుస్తున్నాడో. కండ్లు చింత నిప్పుల్లా ఉన్నాయి. కన్నీళ్లు చెంపల మీద జారి ముత్యాల్లా మారి భుజాలమీద పడుతున్నాయి. జాలి చూపుల ముండ్లు గుండెలను గుచ్చుకొంటున్నాయి. భరించలేని చూపు నేల చూపుగా మారడానికి యత్నిస్తూ ఉంటే -

**కిటుకు**



**ఫ్లవర్‌వాజ్‌లో పోసే నీళ్లలో కొద్దిగా ఎండు కొబ్బరి కోరు వేస్తే పూలు చాలా కాలం తాజాగా ఉంటాయి.**

"పెద్దాయన పాయ గద మామా!" అన్నాడు ఎగదన్ను కొస్తున్న ఏడుపును బలవంతంగా దిగమింగుకొంటూ.

ఊహించ లేని వార్తతో నేను ఉలిక్కి పడ్డాను.

అలాంటి సమయాల్లో ఎలాంటి వెర్రి వాడికైనా వద్దన్నా వేదాంతం పుట్టుకొస్తుంది. అయితే నే నా పని చేయలేదు. ఈశ్వరయ్యను యింట్లోకి పిలిచి కూర్చో మన్నాను. వాడు నా మాట విన లేదు. గబగబ దోసెడు నీళ్లతో నిద్ర మత్తు వదిలించుకొన్నాను. గుడ్డలు మార్చుకొన్నాను. 'పద రా!' అన్నాను.

'ఏందో కార్యాని కని పల్లెకు పోయ్‌నా డంట. ఆణ్ణుంచి అట్నే పుణ్ణాత్ముడు చెప్పే చెందకుండా పాయ గద మామా!'

"పోవడం, ఉండడం మన చేతుల్లో లేదు. నూకలు చెల్లి పోతే ఎవడైనా పోవాల్సిందే. ఆలోచించాల్సింది అది గాదు. ఇప్పుడు మనం చేయాల్సిన పని."

ఆ మాటలో ఈశ్వరయ్య స్కూటర్ ఎక్కాడు. నేను వెనక కూర్చున్నాను. రెండు మూడు చోట్ల అతని అజమాయిషీతో పనులు జరుగుతున్నాయి. ఆ పను లన్నిటినీ ఆపేయ మన్నాడు - పెద్దాయన స్మృతికి గౌరవార్థంగా.

నా ఊహ కందని ప్రవర్తన. ఆ ప్రవర్తన సంస్కారంతో ముడి పడి ఉంది. చదువుతోనే మనిషి సంస్కారవంతు డవుతున్నాడా? లేదు. దానికీ, జన్మజన్మాలకు ఏమైనా సంబంధాలున్నాయా? లేకుంటే ఈశ్వరయ్యకు యింత

సంస్కారం ఎలా అబ్బింది? అని నాలో నేను ఆలోచించుకుంటా ఉంటే ఈశ్వరయ్య పూల మార్కెట్టులో రెండు పూల మాలలు కొన్నాడు. నా చేతి కిచ్చాడు.

పెద్దాయనకు శ్రద్ధాంజలి ఘటించడానికి మే మా పల్లెకు బయలుదేరాము. ఈశ్వరయ్య తపన స్కూటర్ వేగంలో కనిపిస్తూ ఉంది. నా గుండెలు అర చేతుల్లోకి వస్తున్నాయి. అయినా గొంతు పెగల్లేదు.

తిరుపతికి, ఆ పల్లెకు మధ్య దూరం పది పన్నెండు కిలోమీటర్లు. ఈ మధ్యలోనే స్వర్ణముఖి నది. ఆ పల్లెకు పోవా లంటే స్వర్ణముఖిని దాటాలి. ఏండ్లు పూండ్లుగా రాయల సీమ అనావృష్టికి గురై కరువు కాటకాలను అనుభవించింది. ఆకలి చావులను చవి చూసింది. ఈ మధ్య అతి వృష్టితో వరదల బీభత్సం సీమకే ఒక కొత్త అనుభవం. స్వర్ణముఖి నడుముల్లోతు పారింది. నా జీవితంలో నేను చూడలేదు. ఆ ప్రవాహం యిపుడు మోకాళ్ల కిందికి తగ్గింది. అయినా దాని ఉరవళ్లు పరవళ్లు నా తరానికే కొత్తంటే ఈ తరానికి మరీ కొత్త. అందుకే ముసలీ ముతక, చిన్నా పెద్ద యిరుగట్ల మీద నిలబడి అది ఒక చోద్యంగా చూస్తున్నారు. ఎర్రటి నీళ్లు తెల్లని నురగలు గక్కుతూ కంట పడితే కబళించాలన్న రాక్షసత్వానికి మారు పేరుగా పొంగుతూ పొరలుతూ ముందుకు దూసుకొని పోతున్నాయి - పెద్దాయన జ్ఞాపకాలను మింగేసి.

స్కూటర్ తోసుకొంటూ ఆ నదిని దాటుతూ మేమిద్దరం!

అవతలి గట్టు చేరే సరికి దాదాపుగా నా పాంట్ అంతా తడిసింది. ఎంత ఎగ్గట్టుకొన్నా ఈశ్వరయ్య పంచ ముద్దముద్ద యింది. మోకాళ్ల లోతు నీళ్లల్లో తడిసిన స్కూటర్ కదల నం టూ మొరాయించింది. ఆ నీళ్లన్నీ వాడిగి తడి ఆరితే కాని అది కదిలేటట్టు లేదు. అంత వరకు తప్పని సరిగ మేము అక్కడ నిలబడాల్సిందే.

ఆ సమయాన్ని కూడా వృథా చెయ్య కూడదు అను కొన్నాడేమో ఈశ్వరయ్య.

"మామా! పెద్దాయన ఆ కుటుంబం కోసరం పడిన పాట్లు ,చేసిన చాకిరి మాటల్తో చెప్పలేము మామా!" అన్నాడు ఎటో చూస్తూ.

"చచ్చిన వాడి కండ్లు చారెడేసి!" అని నాలుక దాకా వచ్చి ఆగి పోయింది.

"పెద్దాయన మంచి వయసు మిందున్నాడు. అందురు లేదర బిడ్డలే. అప్పుడు ఆ యింటామె చెయ్యోదిలి దాటుకునేసింది. ఆ లేదర బిడ్లకు తల్లీ దండ్రి తానే అయ్‌నాడు. చెయ్ ౹గాల్చుకున్నాడు. పెంచినాడు. పెద్ద జేసినాడు. చదివించినాడు. అందురికీ పెండ్లిండ్లు చేసినాడు. ఇదెంతా ఎట్లా సాద్దె పడిందంటే?- ఒక్క సేద్దింతోనే. అదే గదా కుల వృత్తి. రెక్కలు ముక్కలు జేసుకుంటే బిడ్డలు చేతి కెడిగినారు. వాళ్లు సేద్దిం జేసేది మా వల్ల గాదు. యాపారాలు చేసుకుంటా మంటే ఆ యాపారాలకు పెట్టుబళ్లు. ఇన్ని జేసి సంసారాన్ని ఈడి దాకా యీడ్చుకోనొచ్చి నాడు. మంచి వయసులో తన సుఖాల కన్నిటికి నీళ్లొదిలి దీన్ని గుర్తించక పోతే పోనీ. కనీసం మణిసిగా అయినా గౌరవించ లేదే? - అదే గద మామా నా బాద."

పెద్దాయన మీద అభిమానం కొద్దీ మాట్లాడుతున్నాడా ఈశ్వరయ్య. లేకుంటే తన కుటుంబం కోసరం యింత త్యాగం చేసిన వ్యక్తి యింత నిర్లక్ష్యానికి గురవడానికి కారణం? అదే ఆలోచిస్తున్నాను మూడో మనిషిగా.

"మామా! మణిసికి యాళ కంత తిండి పెట్టక పోవచ్చు. ఒంటినిండా కట్టుకుండే దానికి గుడ్డ లేకుండా పోవచ్చు. తిట్టొచ్చు. కొట్టొచ్చు. ఇం కేమైనా చెయ్యచ్చు. కానీ మణిసిని నిర్లచ్చం చేస్తే మాత్రం తట్టుకునేది శానా కష్టం. ఒక నాడు పెద్దాయన్ను చూసే దానికి వాళ్ల యింటికి పోయ్‌నా. ఒక చిన్న రూంలో చింకి చాప మీద కూసోనున్నాడు. గదంతా చీకటి. ఆ చీకట్లో దోమలు. 'ఏందయ్యా ఈ చీకట్లో?' అన్నాను.

పెద్దాయన యాదాంతిలా నవ్వినాడు. నేను రెప్పార్పకుండా ఆయనకల్లా చూస్తా ఉంటే -

'నీ మొకాన అంత తిండి గొట్టేదే దండగ. ఇంక నీ బతుక్కు ఎల్తురు గూడానా. అదొక కరంటు ఛార్జీ దండగ' అని అన్నారయ్యా సాగినోళ్లు.' ' ఆ మాటంటూ ఈశ్వరయ్య బోరుమన్నాడు.

ఓదార్చడానికి నా వద్ద మాటలు లేవు.

"మామా! అది తండ్రే కావచ్చు. డబ్బే కావచ్చు. చేతిలో ఉణ్ణెప్పుడు వాటి విలువ తెల్దు. అతడికి తండ్రి ఉండాడు. ఆ తండ్రి విలువ తెల్దు. నాకు లేడు. మామా! పెద్దాయన్లో నా తండ్రిని చూసుకుణ్ణాను. అడిగినప్పుడంతా అడిగినంత డబ్బిచ్చినాను. అది ఏ డెనిమిది వేలకు ఏ మాత్రం తక్కువ వుండదు."


"అవును ఈశ్వరా! అంత పెద్ద మొత్తం ఆ పెద్దాయనకు ఎందుకు కావాల్సి వచ్చింది?"

"ను వ్వడగతావని నాకు తెల్సు మామా. నువ్వే గాదు ఎవ్వడైనా అడగాల్సిన ఘాటే. పెద్దాయన పెండ్లాన్ని పాణానికి పాణంగా చూసుకుణ్ణాడు. నెల్లో ఒక దినం. ఆమె పాయ్‌న దినాన పది మందికి అన్నం పెట్టా లనుకుణ్ణాడు. కొడుకుల్తో అన్నాడు. 'అంత గొప్ప గొప్ప పన్లు చేసే దానికి మాతావన ముల్లెలు మురగడం లే'దంటా వాళ్లు ఈడెగిరి ఆడ పణ్ణారు. ఆయన మునాస ఎందుకు పోవాలనుకోని ఆ పని నేను చేసినాను మామా!" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు.

ఈశ్వరయ్యకు పే రుండ వచ్చు కానీ పేద వాడే. పేద వాడికి ఏ డెనిమిది వేలంటే పెద్ద మొత్తమే. అంత పెద్ద మొత్తం యిచ్చా డంటే వాళ్లు నమ్మక పోవచ్చు. పైగా "మీ రిద్దరూ కల్సుకోని ఏవేవి చేసినారో ఏం పాడో? లేకుంటే అన్ని దుడ్లు ఆయన కెందు కిస్తావ్?' అని ఎదురు తిరగతారేమో? ఇచ్చిన డబ్బు తిరిగి వస్తుందో రాదో?" అని ఈశ్వరయ్య బాధ పడుతున్నాడా? అని అతని వెనకన కూర్చొని నేను ఆలోచిస్తున్నాను. - అతని బాధను డబ్బుతో ముడి పెట్టి.

నిముషాల్లో ఊరు చేరుకొన్నాము. ఊరు బరువుగా నిట్టూరుస్తూ ఉంది. మోయ లేని బరువును మోస్తున్నట్లుగా ప్రతి మనిషి తల వాలి పోయింది. ఎవరో వెంట పడి తరుముతున్నట్లు కొందరు హడావిడిగాఅటు యిటుఉరుకుతున్నారు.

నిన్న మొన్నటి వరకు అది ఒక బాధ్యతగానో... కొడుకుతో బంధంగానో క్షణం తీరిక లేకుండా ప్రాకులాడిన కాయం యిప్పుడా యింటి వరండాలో



కదల్లేని కట్టెలా పడి ఉంది. ఆ కట్టెను పూల మాలలతో ముంచెత్తారు. చుట్టూ కూర్చొని పాడి పాడి ఏడుస్తున్నారు. పైన బడి ఏడుస్తున్నారు. ఆ ఊళ్లో తిన్నె లన్నీ కన్నీటి వాగు లనిపిస్తున్నాయి!

ఈ మనుషులు ఎంత నయవంచకులు? ఎంత చక్కగా నాటక మాడుతున్నారు. ఆ కట్టె కదులుతున్నపుడు కడుపు చూసి వేళ కంత తిండి పెట్టలేని చేతులే తలలు బాదుకొంటున్నాయి - ఆ చేతులతోనే, ఆ చేతులతోనే శవ యాత్రకు ఒక ట్రాక్టర్‌ను పూల తేరులా సింగారిస్తున్నారు. ఆ తంతు గమనిస్తుంటే బ్రతికున్నపుడు గొంతులో అన్నిపాలు పోయకుండా చచ్చిన తర్వాత గోదానం చేసినట్లుంది.

ఏడుపులు, పెడబొబ్బల మధ్య ఆ శవాన్ని తెచ్చి పాడె మీద పెట్టారు. పూజలు చేశారు. బ్రతికున్నపుడు పెట్ట లేని కూడు శవానికి 'పిండాకూడు'గా మారింది. ఆ పాడెను వీథి మొగదల వరకు మోసి తెచ్చి పూల తేరు మీద పెట్టారు.

తేరు కదిలింది. వెంట శవ యాత్రకు బయలుదేరిన జనం!

అది శవ యాత్రని డప్పులు... పటాసులు పోటీలు పడి అరుస్తున్నాయి. శ్మశానాన్ని చేరుకోక ముందే వైరాగ్యం భజన గీతాల ఆలాపనగా మారి గుండె గుండెను తాకుతూ ఉంది. వెనక ఏడుపులు తోడుగా వస్తున్నాయి. అట్టహాసంగా ఊరేగుతున్న కట్టె మరి కొంత సేపటికి మట్టి మరుగులో... మరి కొంత కాలానికి మనిషి మరుపుల్లో. ఇది తెలిసిన సత్యమే. అయితే మనిషి ఈ లౌకికపరమైన లంపటాల్లో తగులుకొని ఆరాట పోరాటాల మధ్య నలగడం ఎంతో చిత్రంగా ఉంది.

దారి పొడుగునా చల్లుతున్న పూలతో పోటీ పడుతూ నా ఆలోచనలు. అవి జనం పాదాల కింద పడి నలుగుతున్నాయి. మానవ సంబంధాలను హేళన చేస్తూ.

శవ యాత్ర శ్మశాన వాటికను చేరింది. అప్పటికే అక్కడ ఆ రడుగుల పొడవు, మొల్లోతు గుంత ఎదురు చూస్తూ ఉంది - ఈ మనుషుల గుండె లోతులను సవాలు చేస్తూ, పూల తేరు మీద నుంచి కిందికి దిగిన శవం ఆ గుంతకు మూడు సార్లు ప్రదక్షిణ చేసింది - నలుగురి చేతుల మోపున. పూజాపునస్కారాలు అందుకొనింది. ఏ రోజూ పిడికెడు మెతుకులను ఆ నోటికి ఆప్యాయంగా అందించలేని చేతులే ఆ రోజు మాత్రం పోటీలు పడ్తూ చేటలో పిడికెడు బియ్యాన్ని జవురుకొని ఆ శవం నోట్లో వేస్తున్నాయి. నూకలు చెల్లు వేసినట్లుగా. ఈ తతంగాని కంతా అతీతంగా పాడె మీద కట్టె. గుంతలో ఉప్పూ, పప్పూ పోశారు. నవనవ లాడుతున్న అరిటాకులను పరిచారు. శవాన్ని గుంతలోకి దింప బోతున్నారు.

"మెుల తాడు తెంపేసినారా?" ఎవరిదో అరుపు. హుఁ! మనిషి వచ్చేటప్పుడు వెంట తెచ్చుకోని నూలు పోచనైనా వెంట తీసుకొని పోవడానికి తగడా? నలుగురు నాలుగు పిడికెళ్లు మట్టి వేస్తే వాళ్లతో కలిసి మేమూ.

పెట్టిన దీపం పెట్టిన చోటే ఆరి పోయినట్లు పెద్దాయన పుట్టిన చోటే మట్టిలో కలిసి పోయాడు - ఆడంబరాల మధ్య అతి సహజంగా!

* * *

"వాళ్లు నన్ను పిలిపించినారు మామా!"

పెద్దాయనకు కర్మ క్రియలు జరిగిన తర్వాత ఒక రోజు ఈశ్వరయ్య నాతో అన్నాడు.

"ఎవరు?"

"పెద్దాయన కొడుకులు... కూతుళ్లూ... అల్లుళ్లూ..."

"ఆఁ! పిలిచింది..."

"పెద్దాయనకు 'నువ్వెంత డబ్బిచ్చింది?' అని అడిగినారు."

"నువ్వేం చెప్పావు?"

"ఆ కత మీకెందు కన్నాను."

"దానికి వాళ్లే మన్నారు?"

"పెద్దోళ్లు గదా? పేదోళ్ల ఋణాన పొయ్యే దెందు కని వాపోయ్‌నారు. అందుకే నేను పెద్దాయనకు అప్పియ్య లేదు. తీర్చమని మిమ్మ ల్నడగ లేదు. ఇచ్చినట్టు నేనెవుర్తో గూడా చెప్పుకోలేదు. అని తెగేసి చెప్తి. అయితే వాళ్లు మాత్రం "నువ్వు తీసుకోవాల్సిందే. రాజస్తాన్ నుంచి చలవ రాయి తెప్పిస్తాం. ఈ యిలాకాలో దివిటీ పెట్టి ఎతికినా అట్టా మాదిర యింకొకటి ఉండకుండా నువ్వు పెద్దాయన సమాధి కట్టాల్సిందే!' ' అంటా మొండికి కూసుండ్రి. నేను డబ్బిచ్చింది మీకూ, నాకూ సంబంధించిన యవ్వారం కాదు. అదేందో యిచ్చినోడు, తీను కున్నోడు తేల్సుకోవాల్సిన కత. ఇంక సమాధి కట్టే దంటారా? అది నా వల్ల గాదు" అని లేచి వచ్చేస్తి. నువ్వు చెప్పు మామా నేను చేసిన పని..."

"అక్షరాలా మంచిది కాదు. ఎందు కంటే నువ్వు పెద్దాయనకు డబ్బు లిచ్చింది నిజం. పాతికో పరకో యిచ్చి వేలని అబద్దం చెప్పడం లేదు. వడ్డీలతో చెల్లించ మని అడగ లేదు. వాళ్లకేం? ఉన్నోళ్లు. తండ్రి చేసిన ఋణాన్ని కొడుకులుగా తీర్చాల్సిందే!"

ఈశ్వరయ్య తల వాలి పోయింది. నా మాటలు తలొకెక్కా యనుకుంటే కొన్ని క్షణాల మౌనం తర్వాత తలపైకెత్తాడు.

'మామా! బతుకునే ఒక సవాలుగా తీసుకోని ఒకొక్క చెమట బొట్టును బిడ్డల కోసరం దార పోసిన మణిసి పెద్దాయన. ఆ మహన్నబావుడికి వేళ కింత తిండి, కట్టుకునే దాని కంత గుడ్డయిచ్చే దానికి నోచుకోని నీచులు వాళ్లు. వాళ్లిప్పుడు అప్పు తీరస్తా మంటా ఉండారు. ఎందుకు? లోకం మెప్పు కోసరం. కానీ లోలోపల ఏ మనుకుంటారు? 'ఈ ముసిలినాకొడుకు చచ్చి గూడా మా మీద అప్పు పెట్టి పోయ్‌నా డనుకోరా? - ఈ నింద పెద్దాయన మింద మోప మంటావా?'

అంత గొప్ప అవగాహన ముందు ఈ వామనుడి తల వాలి పోయింది. కింద పడినా పై చెయ్యి నా దనిపించుకో వాలని "పోనీ! పెద్దాయన జ్ఞాపకార్థం ఒక సమాధి..."

నా మాట నా నోట్లో ఉండగానే -

"పెద్దాయనకు నా గుండెల్లో గుడి కట్టుకున్నాను. ఈ చేతుల్తో సమాది కట్టి ఆ గుంత మింద కాదు. పెద్దాయన గుండెల మీద బరువు పెట్ట మంటావా?" అంటూ బోరుమన్నాడు మనిషి అల్పత్వం మీద, స్వార్థం మీద సమాధి కట్టిన ఈశ్వరయ్య.

దేవుడు మనిషిని సృష్టిస్తాడు తన ఛాయగా. అంటే దేవుడే మనిషి. ఆ మనిషి డబ్బుకు దాసోహ మంటే రాక్షసుడు. కాకుంటే దేవుడు. ప్రతిఫలాన్ని కోరని దేవుడు ఈశ్వరయ్య. అతడి హృదయ వైశాల్యాన్ని, నైర్మల్యాన్ని కడ దాక లోకువ చేసి ఆలోచించిన నేను కేవలం మనిషిని! అందుకే -

ఆ దేవుడికి చేతు లెత్తి నమస్కరించే అర్హత కూడా నాకు లేదు!

## విమర్శ

ఒకప్పటి సోవియట్ రష్యా అధ్యక్షుడు బ్రెజ్నెవ్ ఓసారి అమెరికా వెళ్లినపుడు ఓ పత్రికా విలేఖరి ఇలా అడిగాడట..."మీ రష్యాలో ఎవరికీ విమర్శించే హక్కు ఉండదటకదా? మా అమెరికాలో అలా కాదు...ఏ వ్యక్తి అయినా దేశంలో ఎక్కడ నిలబడి అయినా ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు."

అందుకు బ్రెజ్నెవ్ ప్రశాంతంగా..."మా దేశంలోనూ అంతే...ఎక్కడ నిలబడి అయినా, ఏ వ్యక్తి అయినా అమెరికా ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు.

పి. రాధిక, హంపసాగర